నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

నిజాంపేట్: నిజాంపేట్‌లోని శివాజీ నగర్‌లో గురువారం ఎల్లమ్మ పోచమ్మ తల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మహోత్సవాలు గురువారం నుంచి శుక్రవారం వరకు నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సఖ్యంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగాలని కమిటీ సభ్యులు కోరారు. 17వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

జీడిమెట్ల: విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకంపై కలిగే నష్టాలను వివరించాలని మహబూబ్ పాఠశాల కరస్పాండెంట్ రఫీక్ అన్నారు. ఈ నెల 12న నగరంలోని డాక్టర్ ఎంసీఆర్, హెచ్‌ఆర్‌డీ ఇనిస్టిట్యూట్‌లో విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గాంధీనగర్‌లోని మహబూబ్ పాఠశాల విద్యార్థులు సాయిప్రశాంత్ బార్ 4వ తరగతి, కాజల్‌కుమారి 6వ తరగతి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచి బహుమతులు పొందారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ రఫీక్ విద్యార్థులను అభినందించారు.

22 నుంచి కార్తీకమాస ప్రత్యేక పూజలు

జగద్గిరిగుట్ట: కార్తీక మాసం పురస్కరించుకొని చింతల్, పద్మా నగర్ ఫేజ్ 1 లోని కల్యాణ తిరుపతి ఆలయంలో నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 22 నుండి వచ్చే నెల 20 వరకు ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు ఆకాశదీపోత్సవం, ప్రతిరోజు 10 గంటలకు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, ప్రతి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు సామూహిక కుంకుమార్చన, ఈనెల 25న ఉదయం 9 గంటలకు మెట్ల పూజ, 30న శ్రావణ నక్షత్రం సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, నవంబర్ 1వ తేదీన ఉదయం 8 గంటలకు కనకాభిషేకం. 5న ఉదయం 10 గంటలకు సామూహిక సత్యనారాయణ వ్రతం, 8న ఉదయం 9 గంటలకు లక్ష తులసి దళార్చన, 10న సాయంత్రం 7 గంటలకి కార్తీకదీపం, 15న ఉదయం 10 గంటలకు వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించినట్లు, భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు తెలిపారు.

18న జిల్లాస్థాయి ఖోఖో సెలక్షన్స్

కుత్బుల్లాపూర్: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా స్థాయి ఖోఖో సెలెక్షన్స్‌ను ఈ నెల 18న నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ కిష్టయ్య, జోన్ సెక్రటరీ అరుణ జ్యోతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.. ఖోఖో అండర్ 14, అండర్ 17 బాలూరు, బాలికల విభాగాల సెలక్షన్స్‌కు జీడిమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు జరుగుతాయని, పాఠశాలల ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, విద్యార్థులు ఈ సెలక్షన్‌కు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 9290496443 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఔషధ పంపిణీ

జగద్గిరిగుట్ట: స్వర్ణామృతప్రాశన పిల్లలకు ఎంతగానో ఉపయోగపడుతుందని పంచగవ్య డాక్టర్ రాము రామానుజచార్య అన్నారు. ప్రతి నెల పుష్యమి నక్షత్రం రోజున వికాస తరంగిని సంస్థ ఆధ్వర్యంలో చింతల్ ద్వారకా నగర్‌లో బుధవారం నిర్వహించారు. సుమారు 100 మంది 16 సంవత్సరాల లోపు పిల్లలకు వికాస తరంగిని సంస్థ ద్వారా ఈ ఔషధం అందజేశారు. దీని ద్వారా పిల్లల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, గ్రహణ శక్తి పెరుగుతుందని డాక్టర్ రాము రామానుజచార్య తెలిపారు.

బీసీ బంద్‌కు విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం మద్దతు

కుత్బుల్లాపూర్: బీసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపనున్నట్లు విశ్వకర్మ ఐక్యవేదిక మద్దతు ఉంటుందని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందిపేట రవీందర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..78 సంవత్సరాలుగా బీసీలను రిజర్వేషన్ల పేరిట మోసం చేస్తూ వస్తున్నారని, ఎన్నో పోరాటాలు చేసిన బీసీ వర్గాలకు ఓర్పు నశించిదన్నారు. రిజర్వేషన్ల అమలుకు తాడోపేడో తేల్చుకుంటామన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లను అమలు చేయాలని, 56 శాతానికి పైగా ఉన్న బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా వెనుబడి ఉన్నారన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయంపై గళాన్ని వినిపించడానికి ఈ నెల 18న చేపట్టనున్న బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల పాట్లు!


రంగారెడ్డి బస్టాప్ వద్ద బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు


ఐడీపీఎల్‌లోని జగద్గిరిగుట్ట బస్టాప్‌లో చెట్ల నీడలో..

- రోడ్లపైనే బస్సుల కోసం పడిగాపులు
- గతంలో తొలగించి ఏర్పాటు చేయని అధికారులు

రంగారెడ్డినగర్: బస్సుల కోసం ఎదురు చూసే ప్రయాణికులు బస్ షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్నారు.. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఐడీపీఎల్ చౌరస్తా, రంగారెడ్డినగర్ బస్టాప్‌లలో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు నిత్యం పదుల సంఖ్యలో ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు. బస్‌షెల్టర్లు లేకపోవడంతో ఎండలో, వానలో ఇబ్బందులు పడుతున్నారు. ఐడీపీఎల్ చౌరస్తా విస్తరణలో భాగంగా రెండేళ్ల క్రితం జగద్గిరిగుట్ట వైపు వెళ్లే బషెల్టర్‌ను అధికారులు తొలగించారు. నేటికి షెల్టర్‌ను ఏర్పాటు చేయకపోవడంతో చెట్ల నీడలో నిల్చోవాల్సి వస్తుంది. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల తల్లులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా రంగారెడ్డినగర్ బషెల్టర్‌ను మూడు సంవత్సరాల క్రితం తొలగించారు. అసలు ఎందుకు తొలగించారన్న విషయం ఇప్పటికీ తెలియడం లేదు. ఈ విషయమై 'సాక్షి' ఆర్టీసీ అధికారులను అడిగితే అక్కడ బషెల్టర్ ఉందా? అని పేర్కొనడం గమనార్హం. ప్రస్తుతం బస్ షెల్టర్ ప్రాంతం డబ్బాలు వెలిశాయి. ఈ విషయమై పలుమార్లు సంక్షేమ సంఘాల ప్రతినిధులు జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసకువెళ్లినా స్పందన కరువైంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి



ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి సారెగూడెంలో రూ.17 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తున్నామని తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో సమీప కాలనీల వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జక్కుల కృష్ణ యాదవ్, సాయి యాదవ్, మహేందర్ యాదవ్, నాయకులు బాల్ రాజ్, శ్రీశైలం, వీరస్వామి, శ్రీను, నాగార్జున, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం నివాసితుల సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం మండల కార్యదర్శి బొడిగె లింగస్వామి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దుండిగల్: దుండిగల్‌లోని డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో పారిశుద్ధ్య తదితర సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి బొడిగె లింగస్వామి డిమాండ్ చేశారు. గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్‌ను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ సముదాయంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, డ్రైనేజీ మొత్తం నిండిపోయి రోడ్ల మీద పారుతుందన్నారు. దుర్వాసనతో దోమలు పెరిగి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. తక్షణమే స్పందించి సమస్యను పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో దివ్య, జ్యోతి, రాధిక, డి లక్ష్మి, సుజాత, సమరీన్, విజయలక్ష్మి, ముంతాజ్ బేగం, అస్మా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటిని తరలించేందుకు కసరత్తు



సాక్షిలో ప్రచురితమైన కథనం


చెన్నం చెరువును పరిశీలిస్తున్న వివిధ శాఖల అధికారులు

- రెండు కిలో మీటర్ల మేర పైపులైన్ ఏర్పాటుకు ప్రణాళికలు
- త్వరలోనే వివిధ శాఖల అధికారుల సమన్వయ సమావేశం

సాక్షి ఎఫెక్ట్..

దుండిగల్: అధికారుల సమన్వయ లోపం స్థానికులకు శాపంగా మారిందని, ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగు నీరు దిగువ ప్రాంతానికి చేరడంతో మురుగు నీరు ఇళ్లలోకి పూర్తిగా చేరింది. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేటలోని రామచంద్రయ్య కాలనీలో సుమారు 15 కుటుంబాలు కట్టుబట్టలతో ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయాయి. ఇదే విషయాన్ని 'సాక్షి' ఈ నెల 9వ తేదిన 'అయ్యో.. రామచంద్రా' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. ఈ విషయంపై స్పందించిన హైడ్రా చీఫ్ ఇంజనీర్, సీఐ నరేష్, దుండిగల్ మున్సిపల్ ఏఈ సురేందర్ నాయక్ బుధవారం స్థానికంగా పర్యటించారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రణీత్ యాంటీల, 21 సెంచరీ, ఆర్టీసీ కాలనీ, ఎస్‌ఆర్‌ఎస్, క్రాంతి నగర్ ప్రాంతాలకు చెందిన మురుగు నీరు నేరుగా మల్లంపేటలోని చెన్నం చెరువుకు వస్తున్నట్లు గుర్తించారు. చెన్నం చెరువు నుంచి బొల్లారంలోని రేళ్లకుంట చెరువు వరకు సుమారు రెండు కిలో మీటర్ల మేర డ్రైనేజీ పైపులైన్లను నిర్మించేందుకు ఎంత వ్యయం అవుతుందోనని అంచనాకు వచ్చారు. అదే విధంగా రామచంద్రయ్య కాలనీలో నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగించడంతో పాటు మరో సారి ఇక్కడికి మురుగు నీరు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశంపై చర్చించారు. త్వరలోనే హైడ్రా, మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సమస్యను శాశ్వత పరిష్కారం చేస్తామని అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చింతల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సీబీడీ బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 33/11 కేవీ బోయిన్‌పల్లి సబ్‌స్టేషన్ బీవీఆర్ హాస్పిటల్ ఫీడర్ పరిధిలో బాలానగర్ మెయిన్ రోడ్డు, రాజు కాలనీ, సాయి కాలనీ, ఫూల్ బాగ్ ఫేజ్ 1, ఫూల్ బాగ్ ఫేజ్ -2 ఫూల్ బాగ్ ఫేజ్ -3, బీహెచ్‌ఈఎల్ ఆర్‌ఎన్‌డి, బాలానగర్ పోలీస్ స్టేషన్, సాయి బ్లేజ్ కాంప్లెక్స్, బాలానగర్ ఫ్లైఓవర్ తదితర ప్రాంతాలు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాగా టూల్స్ సబ్‌స్టేషన్ గిరినగర్ ఫీడర్ పరిధిలో రంగారెడ్డినగర్, సన్ టెక్ ఇంజనీరింగ్, పంచశీల కాలనీ, పంచశీల కాలనీ ఇండస్ట్రియల్ ఏరియా, నందా ఫుడ్ లైన్, రెయిన్‌బో స్కూల్ గల్లీ, శ్రీలక్ష్మీ ఇండస్ట్రియల్స్, ఎస్కే ఇంజనీరింగ్, ఎస్‌కేఎం టెక్నాలజీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

క్రాకర్స్ దుకాణాలకు అనుమతి తప్పనిసరి

నిజాంపేట్: దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాదారులు దుకాణాల ఏర్పాటు చేసేవారు ముందస్తుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, తాము సూచించే నిబంధనలు తప్పకుండా పాటించాలని మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ సూచించారు. ఈ మేరకు స్టేషన్ హౌస్ ఆఫీసర్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. క్రాకర్స్ షాప్స్‌ని రోడ్డుపైన, ఫుట్‌పాత్‌లపైన ఏర్పాటు చేయవద్దన్నారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగిస్తామన్నారు.

ఎంఎల్‌ఆర్‌ఐటీలో ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్

దుండిగల్: ఎంఎల్‌ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం ప్రేరణ పేరుతో నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు ప్రాజెక్ట్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌కు మేడ్చల్ జిల్లాలోని 22 పాఠశాలల నుంచి 580 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సాంకేతిక పరిజ్ఞానం వెలికి తీయాలనే ప్రధాన ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధారంగా వినూత్న నమూనాలు, ప్రాజెక్టులను ప్రదర్శించారు. ముఖ్యంగా వర్షపు నీటి ఆధారిత ఆటోమెటిక్ దుస్తుల కలెక్టర్, స్థలానికి రోబోటిక్ ఆర్మ్, ఆహార కల్తీ, విద్యుత్ ఉత్పత్తికి పీజోఎలెక్ట్రిక్ రోడ్డు వంటి ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, వైస్ చైర్మన్ మర్రి ధీరేన్‌రెడ్డి, డైరెక్టర్ మర్రి శ్రేయారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ రావు, ఏరోనాటికల్ ఇంజినీరింగ్ విభాగ అధిపతి గుప్తా, కో ఆర్డినేటర్ ఈట బలరాం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులు, అధికారులు, చిన్నారులు

సుభాష్‌నగర్: పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభారాణి అన్నారు. బుధవారం దూలపల్లి అంగన్‌వాడీ సెంటర్-1లో నిర్వహించిన పోషకాహార సంబరాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటే బిడ్డలకు మేలు కలుగుతుందన్నారు. ఐరన్, కాల్షియం, ప్రొటీన్స్‌లు ఆహారంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే బాలామృతాన్ని చిన్నారులకు తప్పక అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం స్ఫూర్తితో ముందుకెళ్లాలి


అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యులు తదితరులు



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దాసి నాగరాజు తదితరులు

సుభాష్‌నగర్: మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. మల్లారెడ్డి ఆస్పత్రి సౌజన్యంతో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ, వికాస్ గ్రామర్ హైస్కూల్ ఆధ్వర్యంలో గాజులరామారం భవానీ నగర్‌లో మహిళలు, పిల్లలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 250 మంది ప్రజలు సేవలను వినియోగించుకున్నారు. ఉచితంగా వైద్యం, మందులు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రావుల శేషగిరి, హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ వ్యవస్థాపకుడు తూటే విజయ్ కుమార్ మాట్లాడుతూ.. మురికివాడల్లో ఇలాంటి వైద్య శిబిరాలు పేదలకు చాలా ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాది శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సాహితి, వికాస్ గ్రామర్ హైస్కూల్ కరెస్పాండెంట్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ మాధవి పాల్గొన్నారు.

కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో..

నిజాంపేట్: భారతదేశ చరిత్రలో స్ఫూర్తిదాయకమైన వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అబ్దుల్ కలాం అని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దాసి నాగరాజు అన్నారు. బుధవారం అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిజాంపేట్‌లోని కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి వాళులర్పించారు. అబ్దుల్ కలాం నిస్వార్థ రాజకీయాలకు చిరునామా అని అన్నారు. ఒక సాధారణ కుటుంబంలో జన్మించి తన కృషి, విజ్ఞానం, నిబద్ధతతో ప్రపంచానికి భారత ప్రతిభను చూపించారని స్మరించుకున్నారు. కార్యక్రమంలో కారుణ్య వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ కిరణ్, కమలాకర్, ప్రతినిధులు సందీప్, ప్రవీణ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటు వద్దు


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

నిజాంపేట్: నిజాంపేట్‌లోని వెంకటరాయ నగర్‌లో మొబైల్ టవర్ ఇన్‌స్టాలేషన్‌కు అనుమతి ఇవ్వొద్దని బుధవారం పలువురు కాలనీ వాసులు కమిషనర్ సాబేర్ అలీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాంపేట్ వార్డు నంబర్ 14లోని వెంకటరాయ నగర్, రోడ్డు నంబర్ 4, ప్లాట్ నంబర్ 62లో ప్రస్తుతం ఉన్న టవర్‌ను వెంటనే తొలగించాలని అభ్యర్థించారు. అదే ఆవరణలో మరో కొత్త మొబైల్ టవర్ ఇన్‌స్టాలేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఇక్కడ మొబైల్ టవర్ ఏర్పాటు చేస్తే రేడియేషన్ వల్ల గర్భిణులు, హార్ట్ పేషెంట్లు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మొబైల్ టవర్ నిర్మాణానికి అనుమతులు ఇవొద్దని కోరారు.



గుంతల రోడ్డు.. మరమ్మతులేవి?

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని కూన మహాలక్ష్మి నగర్ రోడ్డు నెంబర్ 3లో రోడ్డు ధ్వంసమైంది. 2 సంవత్సరాలుగా రోడ్డు వేయకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. చుట్టూ ఉన్న కాలనీలలో కొత్తగా రోడ్లు వేస్తున్నారు కానీ తమ కాలనీలో వేయడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మరమ్మతులు అయినా చేయడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన


పింక్ దుస్తులు ధరించి రిబ్బన్ ఆకారంలో నిల్చున్న సిబ్బంది

సుభాష్‌నగర్: సూరారంలోని మల్లారెడ్డి నారాయణ మల్టిస్పెషాలిటీ హాస్పిటల్‌లో బుధవారం బ్రెస్ట్ కేన్సర్ అవేర్‌నెస్ – ఎంప్లాయీ ఎంగేజ్మెంట్ ప్రోగ్రాంను నిర్వహించారు. హాస్పిటల్ పరిసరాలు పింక్ రంగులో అలంకరించారు. అదే విధంగా సిబ్బంది పింక్ దుస్తులు ధరించారు. సిబ్బంది రిబ్బన్ ఆకారంలో హ్యూమన్ చైన్ ఏర్పాటు చేసి ఈ అంశాన్ని గుర్తు చేశారు. ప్రముఖ డాక్టర్లు స్వప్న జిల్లా, హరీశ్ దారా, శ్రీనివాస తేజస్విని, శ్రీవల్లి మాట్లాడుతూ.. బ్రెస్ట్ కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించడానికి రెగ్యులర్ స్క్రీనింగ్ చేయించుకోవాలని, బ్రెస్ట్ కేన్సర్ ప్రమాదాన్ని తగ్గించే జీవనశైలి మార్పులపై అవగాహన కల్పించారు. కన్సల్టెంట్ రేడియేషన్ అంకాలజీ డాక్టర్ స్వప్న జిల్లా మాట్లాడుతూ..అవేర్‌నెస్ బ్రెస్ట్ కేన్సర్‌తో పోరాటంలో అత్యంత శక్తివంతమైన సాధనమని అన్నారు. మహిళలు ముందస్తు జాగ్రత్తలు, సెల్ఫ్-ఎక్సామినేషన్ గురించి తెలుసుకుంటే వారు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంలో దోహదపడతాయన్నారు.

నాలుగు ప్రాంతీయ దశల్లో లోవేవ్ 25 డ్రిల్

నిజాంపేట్: భారత మహాసముద్రం వ్యాప్తంగా నిర్వహించబడుతున్న ప్రధాన సునామీ మాక్ డ్రిల్ లోవేవ్ 25లో పాల్గొంటోంది. ఈ సందర్భంగా ఇన్కాయిస్ డైరెక్టర్ డా.టి.ఎం.బాలకృష్ణన్ నాయర్ మాట్లాడుతూ.. ఈ డ్రిల్ యునెస్కోకు చెందిన ఇంటర్ గవర్నమెంటల్ ఓషనోగ్రాఫిక్ కమిషన్ ఆధ్వర్యంలో ఇంటర్ గవర్నమెంటల్ కో ఆర్డినేషన్ గ్రూప్ ఫర్ ఇండియన్ ఓషన్ సునామీ వార్నింగ్ అండ్ మిటిగేషన్ సిస్టమ్ ద్వారా నిర్వహించబడుతుందన్నారు. లోవేవ్ 25 డ్రిల్ నాలుగు ప్రాంతీయ దశల్లో జరుగుతోంది. ఈ డ్రిల్ ద్వారా అత్యవసర సేవలు ప్రమాణ ఆపరేటింగ్ విధానాలను పరీక్షించటం, సునామీ వంటి పరిస్థితుల్లో ప్రతిస్పందించగల స్థాయిని అంచనా వేయటం జరుగుతుందన్నారు. 26 భారత మహాసముద్ర దేశాలకు సునామీ హెచ్చరిక బులెటిన్లు జారీ చేస్తుంది. ఈ డ్రిల్ సమయంలో జీటీఎస్, ఈమెయిల్, ఫ్యాక్స్, ఎస్‌ఎంఎస్, వెబ్‌సైట్ ద్వారా జాతీయ, ప్రాంతీయ స్థాయిలో సునామీ టెస్ట్ బులెటిన్లు జారీ చేయబడతాయి. భారతదేశంలో ఈ డ్రిల్‌ను ఇన్కాయిస్ సమన్వయం చేస్తుందన్నారు. ఇందులో ఎన్‌డీఎంఏ, డీఎంఓఎస్, ఎన్‌డీఆర్‌ఎఫ్, పోర్టులు, నౌకాశ్రయాలు, ఇతర సముద్ర సంబంధిత సంస్థలు పాల్గొంటాయని తెలిపారు.

ఘనంగా మాజీ కౌన్సిలర్ జన్మదిన వేడుకలు



కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొల్లం వేణుయాదవ్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. మాజీ ఎంపీపీ సన్న కవిత, మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, మాజీ కౌన్సిలర్లు వేణుయాదవ్‌తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

చింతల్: రాజీవ్ గాంధీ స్మారక క్రీడా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పట్వారి ఎన్‌క్లేవ్‌లోని బసతి జూనియర్ కళాశాలలో బహుమతుల ప్రదానం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా క్రికెట్ టోర్నమెంట్‌లో ఎస్‌ఎస్‌కే కళాశాల మొదటి బహుమతి, శ్రీవిద్య జూనియర్ కళాశాల రెండవ బహుమతి, ఎస్‌ఆర్ జూనియర్ కళాశాల మూడవ బహుమతి సొంతం చేసుకుంది. ఎన్‌ఎస్‌యూఐ నాయకులు కూన రాఘవేంద్ర గౌడ్, ఎన్‌ఎస్‌యూఐ ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షుడు కుందన్ యాదవ్ విజేతలకు బహుమతులను అందజేశారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేష్, శివ, సాయికిరణ్, హరీష్, సాద్విక్, వివిధ కళాశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.